క్లుప్తంగా

వైరల్ జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి


విజయకుమార్‌రాజు, రూరల్ తహసీల్దార్

దెందులూరు: వైరల్ జ్వరాల పట్ల వైద్యులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ పటిష్ట చర్యలు తీసుకోవాలని ఏలూరు రూరల్ మండలం తహసీల్దార్ జీ.విజయకుమార్ రాజు అన్నారు. ఆదివారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, వైరల్ జ్వరాల బారిన పడకుండా ప్రజలను అప్రమత్తం చేసేందుకు విస్తృతంగా అవగాహన సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంపూర్ణ ఆరోగ్యం పరిరక్షణ మండలంగా ఏలూరు రూరల్ మండలాన్ని తీర్చిదిద్దేందుకు ప్రజలందరితోపాటు వైద్యులు వైద్య సిబ్బంది స్వచ్ఛంద సంస్థలు పూర్తి సహాయ సహకారాలు తోడ్పాటు అందించాలన్నారు. వర్షాకాలం వైద్య సిబ్బందికి ప్రజలు తమ వంతు తోడ్పాటును అందించాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటా వైరల్ ఫీవర్లు అసంక్రమిత వ్యాధుల సర్వే మరింత పకడ్బందీగా చేయాలన్నారు. తరచూ క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వేలను వైద్యాధికారులు పర్యవేక్షణ చేయాలని సూచించారు.

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి ఏలూరుకు చెందిన భక్తులు ఆదివారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఏలూరుకు చెందిన చిత్త శ్రీనివాసరావు, చాముండేశ్వరి కుటుంబం అమ్మవారి దర్శనానికి విచ్చేసింది. ఈ సందర్భంగా ఆలయ అధికారులను కలిసి నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళాన్ని అందజేసింది. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించగా, వేద పండితులు ఆశీర్వచనం అందించారు. ఆలయ అధికారి దాతలను అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలతో సత్కరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక వన్‌టౌన్‌లోని వెంకన్న చెరువు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో స్థంభాలు, 11కేవీ లైన్ మార్పిడి పనుల కారణంగా సోమవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నగరంలోని వెంకన్న ట్యాంక్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చిరంజీవి బస్ స్టాండ్ ఏరియా, మార్వాడి గుడి, దక్షిణపు వీధి, మార్కండేయ స్వామి గుడి, రాజ గారి మేడ, దొంగల మండపం రోడ్, పాలతూము సెంటర్ పరిసర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు తెలిపారు.

శునకాల స్వైర విహారంతో హడల్

- వాహనాలపైకి ఎగబడుతున్న కుక్కలు
- వీధి కుక్కల బెడదను అరికట్టాలంటున్న నగర ప్రజలు
- ఏలూరులో 3 వేల వరకు వీధి కుక్కలున్నట్లు అంచనా


పవరు పేటలోని ఒక వీధిలో విచ్చలవిడిగా వీధి కుక్కలు


తంగెళ్లమూడి ప్రాంతంలో హడలెత్తిస్తున్న వీధికుక్కలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో ఎక్కడ చూసినా వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రతి వీధిలోనూ కుక్కల బెడదతో జనం బెంబేలెత్తుతున్నారు. ప్రధానంగా పాఠశాలలకు వెళ్లే చిన్నారులు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులపై వీధికుక్కలు ఎగబడుతున్నాయి. కుక్కల నుంచి తప్పించుకునేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. రోడ్లపై ఇష్టానుసారంగా సంచరిస్తున్న వీధికుక్కల నుంచి తమను కాపాడాలంటూ ప్రజలు సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందిస్తున్నారు. అనేక సందర్భాలలో కుక్కల దాడిలో గాయపడటం, వాహనాల మీద నుంచి పడిపోవడం వంటి సంఘటలను జరుగుతున్నాయి. విద్యాసంస్థలు ఉన్న ప్రాంతంలో సైతం కుక్కలు పెద్ద సంఖ్యలో సంచరిస్తున్నాయి. దీంతో పాఠశాలలకు, కాలేజీలకు వచ్చి వెళ్ళే విద్యార్థులపై, ఆస్పత్రులకు వచ్చి వెళ్లే రోగులు, వారి బంధువులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. కుక్కలు కరిచాక పరుగులు తీసే కన్నా వాటి బారి నుంచి ప్రజలను కాపాడేందుకు నగరపాలక సంస్థ అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఏలూరు నగరంలో 3 వేల వీధి కుక్కలు

ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని మొత్తం 50 డివిజన్ల పరిధిలో అనధికార లెక్కల ప్రకారం 3 వేల వరకు వీధికుక్కలు ఉన్నట్లు సమాచారం. నగరపాలక సంస్థ అధికారులు మాత్రం నగరంలో 1900 నుంచి 2 వేల వరకు మాత్రమే వీధి కుక్కలు ఉన్నట్లు చెబుతున్నారు. అధికారుల లెక్కల ప్రకారం ప్రతి డివిజన్ పరిధిలో 40 నుంచి 50 వరకు కుక్కలు రోడ్లపై యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. ఇంత పెద్ద మొత్తంలో కుక్కలు తిరుగుతున్నా అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కోసారి కుక్కలు కరిచిన సందర్భంలో ఆస్పత్రులు పాలవుతున్న వారి పరిస్థితి దయనీయంగా మారుతోంది.

వీధి కుక్కలకు వ్యాక్సిన్ల మాటేమిటి?

ఏలూరు నగరంలో దాదాపు 1500 వరకు పెంపుడు కుక్కలు ఉన్నాయి. వీటన్నింటికీ జూలైలో అన్ని పశు వైద్యశాలలలో పెద్ద ఎత్తున యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌లు వేస్తున్నారు. ఇదే సమయంలో వీధుల్లో విచ్చల విడిగా సంచరించే వీధి కుక్కలను పట్టించుకునే వారు లేకపోవడంతో వీటికి వ్యాక్సినేషన్ జరగడం లేదు. దీంతో ఇవి ప్రజలపైకి ఎగబడి కరిచిన సందర్భాల్లో ఆస్పత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో కుక్క కాటుకు సంబంధించిన ఇంజెక్షన్‌లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయించాల్సి వస్తుందని ప్రజలు చెబుతున్నారు.

ఎన్ని వినతులు ఇచ్చినా ఫలితం శూన్యం



“వీధి కుక్కల బారి నుంచి రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులకు వినతి పత్రాలు అందించాం. కుక్కలు ఎక్కడ అధికంగా ఉన్నాయో అనే వివరాలను అందజేశాం. కుక్కల బెడదను నివారించే చర్యలు తీసుకుంటామని చెబుతున్నారే తప్ప ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

ఏ.రాణి, జిల్లా కార్యదర్శి, ఐద్వా, ఏలూరు

కుక్కల సమస్యకు పరిష్కారం ఎప్పుడు?



నగరపాలక సంస్థ పరిధిలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. దీనిపై కార్పొరేషన్ అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం. స్థానిక పోణంగి రోడ్డులోని రాజరాజేశ్వరి నగర్ ప్రాంతంలో రాత్రి వేళల్లో విచ్చల విడిగా కుక్కలు సంచరిస్తున్నాయి. ఆ మార్గం గుండా వెళ్ళే వాహనదారులపై చాలా సందర్భాల్లో ఎగబడుతున్నాయి. ఇటీవల మా ప్రాంతానికి విచ్చేసిని డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి దృష్టికి కూడా ఈ సమస్యను తీసుకెళ్లాం

ఎండీ ఇస్మాయిల్ షరీఫ్, సామాజిక కార్యకర్త, ఏలూరు

కుటుంబ నియంత్రణ చర్యలు చేపట్టాం



వీధి కుక్కల బెడద నుంచి నగర ప్రజలను కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాం. వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవలే దీనికి సంబంధించిన కేంద్రాన్ని ప్రారంభించాం. హరియాణాకు చెందిన స్నేహా యానిమల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కుక్కలకు కుటుంబ నిరోధక శస్త్ర చికిత్సలు, యాంటీ రేబీస్ వ్యాక్సిన్‌లు వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఏ.భాను ప్రతాప్, కమిషనర్, నగరపాలక సంస్థ

టీచర్లకు పీ-4 దత్తత బాధ్యత

దెందులూరు: ఉపాధ్యాయులకు కూటమి ప్రభుత్వం పీ-4 విధానాన్ని తప్పనిసరి చేసింది. తమ స్కూళ్లలో కింది స్థాయి సిబ్బందితోపాటు విద్యార్థుల కుటుంబాలను దత్తత తీసుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. డీఈఓ లిఖిత పూర్వక ఆదేశాలను ఎంఈఓలకు పంపారు. ఈ మేరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ లింకును డీఈఓల ద్వారా ఎంఈఓలు ఉపాధ్యాయులకు పంపారు. ఇప్పటికీ బోధన పక్కనబెట్టి ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవలో తరిస్తున్న తమకు ఇదేం తలనొప్పి అంటూ ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. రెండు రోజుల్లో ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వంలోని అన్ని మేనేజ్‌మెంట్ ఉపాధ్యాయులకు పీ-4 అమలు చేస్తున్నామని హెచ్ఎంలు, టీచర్లు విధిగా పాటించాలని పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో వంట చేస్తున్న ఏజెన్సీలోని సహాయకులు, ఆయాలు, నైట్ వాచ్‌మెన్లు, తోటమాలితో పాటు దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న కుటుంబాల వారిని దత్తత తీసుకోవాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు కనీసం ఐదు కుటుంబాలను, ఉపాధ్యాయులు రెండు కుటుంబాలను తప్పనిసరిగా దత్తత తీసుకొని రిజిస్టర్ చేసుకోవాలని ఆదేశించారు.

బలవంతపు రిజిస్ట్రేషన్లు ఆపాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): పీ-4 మార్గదర్శకులుగా ఉపాధ్యాయుల బలవంతపు రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజల ఆర్థిక అసమానతలు తొలగించడం కోసం పీ-4 అనే కొత్త అంశాన్ని తీసుకువచ్చిందని తెలిపారు. ఈ పథకంలో స్వచ్ఛందంగా రిజిస్టర్ అవ్వొచ్చని చెప్పారని, రాష్ట్రంలోని కొంతమంది కలెక్టర్లు, డీఈఓలు ఉపాధ్యాయులు మార్గదర్శకులుగా రిజిస్టర్ కావాలని మెసేజీలు, సర్క్యులర్ల రూపంలో ఒత్తిడి చేస్తున్నారని గోపీమూర్తి విమర్శించారు. బలవంతంగా ఉపాధ్యాయులను రిజిస్టర్ చేయించడం సరికాదని వెంటనే అలాంటివి నిలుపుదల చేయాలని కోరారు. బలవంతపు రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేకపోతే ఉపాధ్యాయ సంఘాలను కలుపుకుని ఆందోళనకు దిగుతామని ఆయన హెచ్చరించారు.

వైఎస్సార్‌సీపీని బలోపేతం చేయాలి

జిల్లా అనుబంధ విభాగ కమిటీల ఇన్‌చార్జి కొలుసు


పార్టీ కమిటీలపై చర్చలో కొలుసు మోహన్‌యాదవ్, పార్టీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్, సమన్వయకర్తలు

ఏలూరు టౌన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారని, ఏలూరు జిల్లాలో పార్టీ అనుబంధ విభాగాల కమిటీల నియామక ప్రక్రియను వేగంగా పూర్తిచేసేందుకు జిల్లా నేతలు సమష్టిగా కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల కమిటీల జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొలుసు మోహన్ యాదవ్ అన్నారు. ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు, ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్‌తో ఆయన ప్రత్యేకంగా చర్చించారు. జిల్లాలో అనుబంధ కమిటీల నియామకాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ అనుబంధ విభాగాల కమిటీ పర్యవేక్షణపై ఆయనతో జిల్లా నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్రస్థాయిలో వ్యతిరేకత పెరిగిపోయిన తరుణంలో ప్రజా సమస్యలపై వైఎస్సార్‌సీపీ నేతలు పోరుబాట పట్టాలని, పార్టీ నాయకులంతా సమష్టిగా కూటమి కక్షపూరిత దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసులను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలను అమలు చేసే పరిస్థితి కనిపించటం లేదని, 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రారంభించి ఏప్రిల్ నెల నుంచి ఈ మూడు నెలల కాలంలో టీడీపీ ప్రభుత్వం ఏకంగా రూ.37 వేల కోట్ల అప్పులు చేసిందని, దేశంలోనే అప్పులు చేయటంలో ఏపీ నెంబర్ వన్ స్థానంలో నిలిచినట్లు కాగ్ నివేదిక పేర్కొందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	44	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	24	బీక్లచిక్కుడు	96
వంకాయలు (తెలుపు)	34	చామదుంపలు	38
బెండకాయలు	26	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	64	కంద	00
కాకర కాయలు	30	బీట్‌రూట్	38
బీరకాయలు	26	కీరా దోస	40
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	26	అల్లం	60
క్యారెట్	38	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	25	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	24	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	25-25	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	37
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	39
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	15
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్ఈఎల్	21.15	4822	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	23
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	23
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	32
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	30
ఏలూరు - తిరుపతి	16.00	4830	31

వ్యక్తి ఆత్మహత్య

దెందులూరు: వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఏలూరు రూరల్ పరిధిలోని కోడెలు రోడ్డులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఏలూరు రూరల్ ప్రాంతానికి చెందిన కానూరు సాయిబాబా (30) స్థానికంగా మెకానిక్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడికి గంగా భవానితో వివాహం అయింది. భార్యా భర్తల మధ్య విభేదాలతో వీరు వీరు విడిగా ఉంటున్నారు. శనివారం రాత్రి ఇంటి వద్ద ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై దాడి

నిడమర్రు: బువ్వనపల్లిలో పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేసి పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై వీర ప్రసాద్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బువ్వనపల్లి గ్రామంలోని వెలంపేట ప్రాంతంలోని ఓ పశువుల పాకలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్సై వీర ప్రసాద్ తన సిబ్బందితో దాడి చేశారు. దాడిలో 10 మంది జూదరులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.7,560 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిని సోమవారం తాడేపల్లిగుడెం కోర్టులో హాజరుపరుస్తామన్నారు.

అబ్దుల్ కలాం జీవితం ఆదర్శనీయం

భీమడోలు: భారత రత్న, మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పలువురు వక్తలు అన్నారు. భీమడోలు సర్కిల్ ఫొటో గ్రాఫర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. భీమడోలు సంత మార్కెట్‌లోని అబ్దుల్ కలాం, డాగూరే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్కిల్ గౌరవ అధ్యక్షుడు పిల్లి బ్రహ్మరావు, సర్కిల్ అధ్యక్షుడు ద్రాక్షారపు శ్రీరామ్‌లు మాట్లాడుతూ సాధారణ స్థాయి నుంచి దేశ ప్రథమ పౌరునిగా ఎదిగిన మహోన్నత వ్యక్తి అబ్దుల్ కలాం అన్నారు. రక్షణ రంగంలో చేసిన సేవలతో దేశం ప్రపంచానికి ధీటుగా నిలిచిందన్నారు. ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో ముందుంచే యువత తన వంతు పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో ప్రతినిధులు పీవీఆర్ మూర్తి, ఏవీ నాగరాజు, ఏవీ రంగారావు, డి.శ్రీనివాస్, నరేష్, తేజ, కె.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలు ఎక్కడ?


'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో మాట్లాడుతున్న సమన్వయకర్త జేపీ


'రీకాలింగ్ బాబూస్ మేనిఫెస్టో' క్యూఆర్ కోడ్ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న దృశ్యం

ఏలూరులో మూడు డివిజన్లలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

ఏలూరు టౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే .. ఒక్కో నియోజకవర్గంలో 100 మంది యువతకు ఉపాధి కోసం భారీగా నిధులు ఇస్తామని, ఉద్యోగాలు ఇస్తామని నమ్మించి యువతను దారుణంగా మోసం చేశారని వైఎస్సార్‌సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్ళపల్లి జయప్రకాష్ ఆరోపించారు. ఏలూరు నగరంలో ఆదివారం రాత్రి మూడు డివిజన్లలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' కార్యక్రమాలు చేపట్టారు. ఏలూరు వన్ టౌన్‌లో 5, 6 డివిజన్ల పరిధిలో కార్పొరేటర్ గరికపూడి ఇమ్మానియేల్ జయకర్, రావి సునీల్, తులసీ ఆధ్వర్యంలో, 8వ డివిజన్‌లో ఎం.ప్రభాకర్, సృజన్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా, సమన్వయకర్త జయప్రకాష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమన్వయకర్త జేపీ మాట్లాడుతూ.. ఒక్కో నియోజకవర్గంలో వందమంది యువతకు ఒక్కో యువకుడికి రూ.10లక్షల చొప్పున ఉపాధి కల్పనకు డబ్బులు ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి ఏడాది గడచినా ఈ హామీ విషయంపై కూటమిలోని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నోరు మెదపడం లేదని విమర్శించారు. లోకేష్ హామీ ఇచ్చినట్లు జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అధికారం చేపట్టిన నాలుగు నెలల్లోనే ఏకంగా కొత్తగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వాటిలో 1.23 లక్షల ఉద్యోగాలు కల్పించారని గుర్తు చేశారు. కూటమి అధికారం చేపట్టిన అనంతరం ఉన్న ఉద్యోగాలను తీసివేసి నిరుద్యోగ యువత పొట్టగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీ పరిస్థితి ఏంటో అర్థం కావటంలేదనీ, ఎప్పుడు ఉద్యోగాలు భర్తీ చేస్తారోనని సందేహం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమాల్లో స్థానిక నాయకులు ముదుండి ప్రవీణ్, ఖాసిం, రాజేంద్ర, సత్యనారాయణ, చంటి, సునీత, రంగబాబు, ప్రసాద్, నాగు, పూజిత్, ఎస్కే ప్రసాద్, ఫణి, బేగ్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, నగర మహిళా అధ్యక్షురాలు జిజ్జువరపు విజయనిర్మల, వాణిజ్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీఎంఆర్, బీసీ సెల్ నగర అధ్యక్షులు కిలాడి దుర్గారావు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఇనపనూరి జగదీష్, ఎచ్చెర్ల ఉమామహేశ్వరరావు, బండ్లమూడి సునీల్, రుబీనా, స్థానిక పార్టీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పుడమి తల్లికి పచ్చ తోరణం


పాతూరు వద్ద సార్వా వరి నాట్లు వేస్తున్న కూలీలు

భీమడోలు: వర్షాధార ప్రాంతాల్లో ఊపందుకున్న వరి నాట్లు పుడమి తల్లికి పచ్చ తోరణంలా కనిపిస్తున్నాయి. సార్వా సీజన్‌లో సకాలంలో వర్షాలు పడక, గోదావరి కాలువ నీరు పంట పొలాలకు చేరక, నాట్లు అలస్యమవుతున్నాయి. దీంతో రైతాంగం మెరక ప్రాంతాల్లో నారుమడులు ఎండిపోతుండడంతో ఇంజన్లు పెట్టి నీటిని తోడుకునే పరిస్థితులు దాపురించాయి. దీంతో ఈ పంట చేతి కందే వరకు భయంగా ఉందని రైతాంగం ఆందోళన చెందుతుంది. కొన్ని రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఊపిరి పీల్చుకున్న రైతులు పనులు ముమ్మరం చేశారు. దీంతో సార్వా నాట్లు డెల్టా ప్రాంతాల్లో దాదాపు పూర్తయ్యాయి. వర్షంపై ఆధారపడిన ప్రాంతాల్లో రైతులు నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. మండల వ్యాప్తంగా 6 వేల హెక్టార్లలో వరి సాగు చేస్తున్నారు. ఇప్పటి వరకు 95 శాతానికి పైగా వరి నాట్లు పూర్తయినట్లు సంబంధిత వ్యవసాయ సిబ్బంది చెబుతున్నారు.

ఆడబిడ్డ నిధి హామీని అమలు చేయాలి

భీమడోలు: ఆడబిడ్డ నిధి హామీని వెంటనే అమలు చేయలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ డిమాండ్ చేశారు. ఆడబిడ్డ నిధి హామీని నెరవేర్చాలంటే ఆంధ్రను అమ్మేయాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెంనాయుడు అనడం, మీ చేతకాని ప్రభుత్వ విధానమా అని ఆయన విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను నిరాంటకంగా అమలు చేస్తే కూటమి ప్రభుత్వంలోని మూడు పార్టీలు సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేక చతికిల పడ్డాయన్నారు. ఎన్నికల్లో మహిళల ఓట్లు లక్ష్యంగా ఆడబిడ్డ నిధి ద్వారా ప్రతి నెలా రూ.1500 అందిస్తామని హామీ ఇచ్చాయని, దీనిని అమలు చేయమంటే ఆంధ్రను అమ్మేయాల్సి వస్తుందని టీడీపీ సీనియర్ మంత్రి అచ్చెంనాయుడు అనడం దారుణమన్నారు. 13 నెలల కాలంలో కూటమిప్రభుత్వం ప్రజల్లో వ్యతిరేకతను మూట కట్టుకుందన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పాలనపై దృష్టి సారించకుండా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ లిక్కర్ స్కామ్ పేరుతో అరెస్ట్‌లు చేయడం దారుణమన్నారు. కూటమి పాలనలో లిక్కర్ స్కామ్ జరుగుతుందని, విద్య వ్యవస్థ నిర్వీర్యమవుతుందని, పేద విద్యార్థులకు విద్య దూరమవుతుందని ఆయన విమర్శించారు.

రైల్వే గేటు మీదుగా రాకపోకల పునరుద్ధరణ

భీమడోలు: రైల్వే ట్రాక్ మరమ్మతులు ముగిసినందున ఆదివారం సాయంత్రం నుంచి రైల్వే గేటు తెరుచుకుంది. దీంతో వాహన రాకపోకలు ఆరు రోజుల తరువాత పునః ప్రారంభమయ్యాయి. వాస్తవానికి ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రైల్వేగేటు మూసేస్తున్నట్లు రైల్వే అధికారులు ప్రకటించారు. అనివార్య కారణాలతో 22వ తేదీ నుంచి ట్రాక్ అత్యవసర మరమ్మతులను చేపట్టారు. దీంతో జిల్లాలోని పలు డిపోలనుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ప్రత్యామ్నయ మార్గాల ద్వారా భీమడోలు చేరుకున్నాయి. ప్రముఖ ద్వారకాతిరుమల దేవస్థానానికి వెళ్లే భక్తులు, ప్రయాణికులు నానా అవస్థలు పడ్డారు. అదే విధంగా వ్యవసాయ పనుల నేపథ్యంలో రైతులతో పాటు వృద్ధులు, మహిళలు, ఉద్యోగులు, విద్యార్థులు తాడేపల్లిగూడెం, ఏలూరు వైపుగా వెళ్లేందుకు నానా ఇబ్బందులు పడ్డారు.

కళ్ల కలకపై అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: వర్షాకాలంలో సాధారణంగా వచ్చే కళ్ల కలకపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీహెచ్‌సీ ఆప్తమాలిక ఆఫీసర్ దివ్య అన్నారు. ఆదివారం దెందులూరు సీహెచ్‌సీలో కళ్ల కలకపై అవగాహన కల్పించారు. కళ్ల కలక వచ్చిన వారు తరచూ వేడి నీటితో కళ్లను కడుక్కోవాలని ఉతికిన కండువాతో మాత్రమే తుడుచుకోవాలన్నారు. నల్ల కళ్లద్దాలు ధరించి కంటి వైద్యుల సూచనలు సలహాలు వైద్య పరీక్షలు అనంతరం మందులు వాడాలన్నారు. కళ్ల కలకే కదా అని నిర్లక్ష్యం చేయకూడదని అది ఎటువంటి ప్రమాదానికైనా దారి తీయొచ్చని ఆమె సూచించారు.

రక్తహీనత పరీక్షలను నిర్లక్ష్యం చేయొద్దు

దెందులూరు: రక్తహీనత పరీక్షలను ఏ ఒక్కరూ నిర్లక్ష్యం చేయొద్దని గోపన్నపాలెం ప్రభుత్వ వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ రాకేష్ డాక్టర్ రోజ్ మేరీ అన్నారు. ఆదివారం గోపన్నపాలెం ప్రాథమిక వైద్యశాలలో రక్తహీనత అసంక్రమి త వ్యాధులపై అవగాహన పరీక్షలు నిర్వహించారు. రక్తహీనత లేకుండా ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేందుకు ఆకుకూరలు, కూరగాయలు పోషకవిలువలు కలిగిన పదార్థా లను తీసుకోవాలన్నారు తగినంత విశ్రాంతి, వ్యాయామం ప్రతి వ్యక్తికీ తప్పనిసరి అన్నారు. ఎటువంటి అనారోగ్యం సంభవించినా నిర్లక్ష్యం చేయకుండా సమీప వైద్యశాలలో పరీక్షలు చేయించుకొని మందులు వాడాలన్నారు

విద్యార్థులకు బ్లడ్ గ్రూపు పరీక్షలు

ఉంగుటూరు: కాలేజీ విద్యార్థులకు బ్లడ్ గ్రూపు పరీక్షలు నిర్వహించాలని, మానవత సభ్యులు నిర్ణయించారు. ఆదివారం మానవత సమావేశం గోపీనాథపట్నం గ్రామంలో కోనే వీర వెంకట సత్యనారాయణ అధ్యక్షతన నిర్వహించారు. రీజియన్ చైర్మన్ గోపి మాట్లాడుతూ నల్లజర్లలో అగస్టు మూడో తేదీన నిర్వహించే నూతన కార్యవర్గ జిల్లా సమావేశానికి ఎక్కువ సంఖ్యలో తరలి వెళ్లాలని పిలుపు నిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నికై న పుప్పాల గోపిని సభ్యులు అభినందించారు.